అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

'సోలార్'కు భూములివ్వం

సర్వేబృందాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

సోలార్ పరిశ్రమ ఏర్పాటు కోసం శుక్రవారం మండల పరిధిలోని వంకమద్ది గ్రామంలో సర్వే బృందాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. సోలార్ కు భూములు ఇచ్చే అంశంపై స్థానిక ప్రజలతో రెవెన్యూ అధికారులు సమీక్షించగా తాము భూములిచ్చే ప్రసక్తే లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు. పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు భూములపై హక్కులు కల్పించకుండా కార్పొరేట్ సంస్థలకు అప్పగించి తమకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ మంది పేదలు గొర్రెలు మేకలు పశువులను మేపుకొని జీవనం సాగిస్తున్నామని, ఇలాంటి భూములను అప్పగిస్తే తాము ఎలా జీవనం సాగించాలని వంకమద్ది, గురి కాని వారి పల్లి, పెద్దరాము పల్లి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఎక్కడా కూడా సోలార్ కు ప్రభుత్వ భూములు, పట్టా భూములు కాని ఇతర రకాల భూములను ఇవ్వడం కుదరదని తెగేసి చెప్పారు. గ్రామ స్థాయిలో సర్వే చేయడానికి వచ్చిన సర్వే బృందాన్ని అడ్డుకుంటామని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి సాగులో ఉన్న తమకు ఆ భూమిపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీనివాసులు ,వెంకటరమణ, సర్వేయర్లు బాబు, మానస, గ్రామ రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చినుకు జాడ 'కరువు'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రమంతటా ఈఏడాది విస్తారంగా వర్షాలు పడ్డాయి. ప్రధాన నదులన్నీ పెద్దఎత్తున ప్రవహించాయి. అయితే అనంతపురం జిల్లాలో మాత్రం చినుజాడ 'కరువు' అయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే ఒక్క ఆగస్టు నెలలో మాత్రమే అధిక వర్షపాతం పడింది. తక్కిన అన్ని నెలల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో జూన్, జులై, సెప్టెంబరు మాసాల్లో వర్షాభావం నెలకొంది. ఇక రబీ ఆరంభమైన అక్టోబరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ప్రభావం పంటల సాగుపై పడింది.

ఆగస్టులో ఒక్కటే అధికం

సీజన్ ఆరంభమైనప్పటి నుంచి చూస్తే జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.2 మిల్లీమీటర్లు అయితే 47.9 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. 21.7 శాతం వర్షపాతం లోటుంది. ఇక జులై నెలలో సాధారణ వర్షపాతం 64.3 మిల్లీమీటర్లకుగానూ 34.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. అంటే సాధారణ వర్షపాతం కంటే 46 శాతం తక్కువ పడింది. జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు జులై నెల అత్యంత కీలకమైంది. ఈ నెలలో పదునయితే రైతులు పంటలు సాగు చేసుకుంటారు. కాని కీలకమైన ఈనెలలో వర్షపాతం పడకపోవడంతో సాగు విస్తీర్ణం చాలా వరకు తగ్గింది. ఇక ఆగస్టు నెలలో ఖరీఫ్ విత్తన సాగు ముగిసింది. ఈనెలలో పెద్దఎత్తున వర్షాలు పడ్డాయి. ఈ నెలలో సాధారణ వర్షపాతం 84.4 మిల్లీమీటర్ల అయితే 165.9 మిల్లీమీటర్లు నమోదయింది. అంటే సాధారణం కంటే 96.6 శాతం అధికంగా పడింది. ఇక సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 111.6 మిల్లీమీటర్లు అయితే 87 మిల్లీమీటర్లు పడింది. అంటే సాధారణం కంటే 22.1 శాతం వర్షపాతం లోటుంది. ఖరీఫ్ సీజన్ మొత్తం జూన్ నుంచి సెప్టెంబరు వరకు 321.5 మిల్లీమీటర్లుకుగానూ 335.6 మిల్లీమీటర్లు పడింది. మొత్తంగా చూసినప్పుడు సాధారణ వర్షపాతం నమోదయినట్టుగా కనిపిస్తోంది. కాని నెలల వారీగా చూసినప్పుడు తేడాలు అధికంగానున్నాయి. మొత్తం సీజన్‌లో సాధారణ వర్షపాతంగా కనిపించడంతో ప్రభుత్వం కరువు మండలలు ప్రకటించే అవకాశాల్లేవని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

ఆగస్టులో ఒక్కటే అధికం
అన్ని మాసాల్లోనూ వర్షాభావమే

రబీలోనూ వర్షాభావమే

రబీలోనూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అక్టోబరు నెలలో సాధారణ వర్షపాతం 68.4మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 28.4 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 58.5 శాతం తక్కువ పడింది. దీంతో ఈ సీజన్‌లోనూ పంటలసాగుపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెలలో కేవలం నాలుగు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయింది. తక్కిన అన్ని మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులే నెలకొని ఉన్నాయి.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆటో డ్రైవర్ల సేవా పథకం అందని ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలని సిఐటియు రవాణా రంగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో ఏవో వెంకటనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం అమలు వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి 15వేలు ప్రకారం కొంతమందికి మాత్రమే పంపిణీ చేసిందన్నారు. ఈ మొత్తాన్ని 30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు పెనాల్టీ పెంచిన జీవో 21 రద్దు చేయాలని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెంచిన పెట్రోలు, డీజలు, గ్యాస్ ధరలు తగ్గించాలని ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి పెడపల్లి బాబా, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జిఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

2027 మార్చిలోగా తుమకూరు- రాయదుర్గం రైల్వే లైన్ పూర్తి

కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

ప్రజాశక్తి - మడకశిర టౌన్

దక్షిణ భారతదేశంలో రూ. 47 వేల కోట్లతో 3800 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయని రాయదుర్గం, తుమకూరు రైల్వే లైన్ పనులను 2027 మార్చి లోగా పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడించారు. మడకశిర ప్రాంతంలో జరుగుతున్న తుంకూర్ రాయదుర్గం రైల్వే లైన్ నిర్మాణ పనులను ఆయన హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామితో కలసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ రైల్వే లైన్ పరిధిలో 14 రైల్వే స్టేషన్ల వస్తాయని అందులో మడకశిర ప్రాంతంలో రెండు రైల్వేస్టేషన్లు వస్తాయని చెప్పారు. తుమకూరు – దావణగెరె రైల్వే లైన్ పనులను కూడా 2027 జూన్ జూలై నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ రైల్వే లైనుకు సంబంధించిన సర్వే, భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. ఈ రైల్వేలైన్ ఏర్పాటుతో శిర, హిరియూర్‌కు కూడా రైల్వే సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. హిందూపురంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగే విధంగా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, ఐదు మండలాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు

ఇల్లు కోల్పోయిన బాధితులు మంత్రికి వినతి : రైల్వే లైన్ నిర్మాణం కోసం ఇల్లు పోగొట్టుకున్న బాధితులు కేంద్ర మంత్రి సోమన్నను కలసి తమకు న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం రైల్వే లైన్ నిర్మాణ పనులను పరిశీలనలో భాగంగా హిందూపురం రోడ్డు మైనార్టీ కాలనీ వద్ద పరిశీలిస్తూ ఉండగా మైనార్టీ కాలనీకి చెందిన మహిళలు మంత్రిని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. గత సంవత్సర క్రితం వచ్చిన సందర్భంగా కూడా మంత్రికి ఇల్లు కోల్పోయిన వారికి పునరావసం కల్పించాలని కోరుకొన్న ప్రయోజనం లేకపోవడంతో మరోమారు మంత్రికి ఈ సందర్భంగా విన్నవించారు. అయితే మంత్రి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా బాధితులకు న్యాయం చేయాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు డిఆర్‌డిఎ వెలుగు ఆధ్వర్యంలో నడుస్తున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో శ్రీనిధి బ్యాంక్ గోడ పత్రికలను డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా మహిళా సంఘాల మహిళలు తమ జీవనోపాదులను పెంపొందించుకోవాలన్నారు. ఇతర ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం పొందవచ్చన్నారు. శ్రీనిధి ద్వారా గరిష్టంగా సంఘానికి రూ.5 లక్షల వరకు 11 శాతం తక్కువ వడ్డీతో వారి జీవనోపాధిని బట్టి ఒక్కో మహిళకు లక్ష రూపాయల వరకు రుణం పొందవచ్చని చెప్పారు. 12 నుండి 36 కంతులలో చెల్లించే వెసులుబాటు ఈ పథకం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ రుణం తీసుకున్న మహిళ ఆకస్మికంగా మరణిస్తే తీసుకున్న మొత్తం రుణం అంతా మాఫీ అవుతుందన్నారు. రుణం పొందాలంటే ప్రాసెసింగ్ ఫీజు, పెనాల్టీ చార్జీలు ఉండవన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 23,411 సంఘాల సభ్యులకు రూ. 234 కోట్లు మంజూరు అయిందన్నారు. ఇప్పటివరకు 9903 మంది సభ్యులకు రూ.89 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాల సభ్యులు శ్రీనిధి ద్వారా రుణాలు పొంది అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

హమాలీలకు ప్రతినెలా 10లోపు వేతనాలు చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సివిల్ సప్లై అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పుట్టపర్తి సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 12 స్టాక్ పాయింట్లకు సంబంధించి ఒక్కొక్క స్టాక్ పాయింట్‌లో ఒక్కొక్క రకంగా ఉన్న సమస్యలను గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. గత దసరా సందర్భంగా ఇచ్చిన యూనిఫామ్ కు సంబంధించి కుట్టిన కూలి రెండవ దసరా పోయినా చెల్లించలేదన్నారు. పాఠశాలలకు బియ్యం సరఫరాలో అనేక సమస్యలు ఎదురవుతున్న వాటిని అధిగమించి హమాలీలు పని చేస్తున్న ప్రభుత్వం నుంచి వీటికి సంబంధించి కూలి చెల్లించడం లేదని వాపోయారు. హమాలీలకు ప్రతినెల బిల్లులు 28, 30 తేదీల వరకు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతినెల 10 వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, 9 స్టాక్ పాయింట్లలోని 39 మంది పేర్లను పిఎఫ్‌లోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. ప్రారంభం నుంచి అనేక పాయింట్లలో స్వీపర్ బిల్లు ,వాటర్ బిల్లు చెల్లించకుండా స్థానిక అధికారులు వ్యవహరించడం బాధాకరమన్నారు. పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం దించి రావాలంటే హమాలీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో లాగా స్టోర్ల వరకు దించేవిధంగా చూడాలన్నారు. సంబంధం లేని పనులు చేయించి వాటికి సంబంధించి కూలి ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. గత నెలకు సంబంధించి బిల్లులు ఇప్పటివరకు తీసుకోలేదని ఇక వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారోనని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి నాగరాజు, కోశాధికారి కె రామదాసు, ఉపాధ్యక్షులు శ్రీరాములు, కొండయ్య, సూరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా అమడగూరు : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసుకున్నామనిస్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు. గ్రామాన్ని దత్తకు తీసుకొని మోడల్ విలేజ్ గా సమగ్ర అభివృద్ధిని చేపట్టేందుకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి నియోజకవర్గ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అమడగూరునుఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఆయా శాఖల వారీగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్న దానిపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలపై ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. అమడ గూరు గ్రామ సమగ్ర అభివద్ధిపై వచ్చే సమావేశాన్ని అక్కడే నిర్వహిస్తామని అంతలోగా సంబంధిత అధికారులు తగిన నివేదికలతో రావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే : సత్యసాయి బాబా 100 వ జయంతి వేడుకల పురోగతిపై జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అడిగి తెలుసుకున్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న పలు అభివద్ధి పనులపై స్థానిక అధికారులతో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ డిఈ నరసింహామూర్తి, ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లెక్కల మాస్టారు లెక్కలు తప్పాయ్!

ఆర్‌ఎన్ఎస్ స్టడీస్ పేరుతో యాప్, యూట్యూబ్‌లో పాఠాలు
చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

యాప్ లో అప్లోడ్ చేసి, ధర నిర్ణయించిన వీడియోలు

ఆర్‌ఎన్ఎస్ స్టడీస్ పేరుతో ఏర్పాటు చేసిన బ్యానర్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ప్రభుత్వ విధులను పక్కనబెట్టి యూట్యూబ్‌లో పాఠాలు చెబుతూ చర్చనీయాంశమయ్యాడు. ఆర్‌ఎన్ఎస్ స్టడీస్ పేరుతో యాప్ సృష్టించి, పాఠశాల సమయాల్లో కూడా వీడియోలు తీయడం, సోషల్ మీడియాలో పాఠాలు ప్రచారం చేయడం లాంటివాటికి పాల్పడుతున్నాడు. ఈ ఉపాధ్యాయుడు యూట్యూబ్‌లో పాఠాలు చెప్పడం, ప్రమోషన్ వీడియోలు చేయడం తమ దృష్టికి వచ్చిందని పాఠశాల హెచ్ఎం శశికళ, ఎంఇఒ 1 హనుమంత రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారులు మంగళవారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపి, ఆయనపై నివేదిక పంపినట్లు చెప్పారు. ప్రభుత్వ వేతనం తీసుకుంటూ సోషల్ మీడియాలో స్వప్రచారం చేయడం ప్రభుత్వ నియమావళికి విరుద్ధమని వారు స్పష్టం చేశారు. వేలాది రూపాయలు వేతనాలు తీసుకుంటూ విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, యూట్యూబ్ బోధనలకే ప్రాధాన్యత ఇస్తున్నాడన్నారు. కోచింగ్ సెంటర్లు, యాప్ నిర్వహిస్తూ పుస్తకాలను ప్రచారం చేస్తూ లక్షలు గడిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో క్రియేటర్‌గా ఫీల్ అవుతూ "నా పాఠాల నుంచే ప్రశ్నలు వస్తాయి, నా కోచింగ్ తప్ప ఇంకేదీ పనికిరాదు" అంటూ విద్యార్థులకు బిల్డప్ ఇస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేరును ఉపయోగించి యూట్యూబ్‌లో ప్రత్యక్షమవుతున్న ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి మాస్టార్లు పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ

అరెస్టు వివరాలు వివరిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పాకిస్తాన్-ఐఎస్ఐ ఆధారిత జైష్-ఎ-మొహమ్మద్ (జెఇఎమ్) కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సంబంధాలను కొనసాగిస్తూ వారితో సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్న ఇరువురి వ్యక్తులను ధర్మవరం పోలీసులు అరెస్టు చేసినట్లు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుండి వచ్చిన సమాచారం ఆధారంగా పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ ఐ ఎస్ ఐ తో సంబంధమున్న ఉత్తర్ ప్రదేశ్ నివాసి సాజాద్ హుసేన్, మహారాష్ట్ర నివాసి తౌఫీక్ ఆలం షేక్‌ను ధర్మవరం పోలీసులు గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబందించిన వివరాలను శుక్రవారము జిల్లా పోలీసు కార్యాలయం లోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు.

ధర్మవరానికి చెందిన కోత్వాల్ నూర్ మొహమ్మద్ పాకిస్తాన్-ఐఎస్ఐ ఆధారిత జైష్-ఎ-మొహమ్మద్ (జెఇఎం)కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుడిగా ఉంటూ, రాడికల్/జిహాది కార్యకలాపాలలో పనిచేయడంతో గతంలో అతడిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఈ విచారణలో మరో ఇద్దరు జిహాది సభ్యులను గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు బృందాలు ఉత్తర్ ప్రదేశ్ పోలీసుల సహకారంతో అమ్రోహా లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సేన్‌ను అరెస్టు చేశాయన్నారు. అతను జమా మదరాసలో అలిం కోర్సు చేస్తున్నారన్నారు. హుస్సేన్ నుంచి ఎలెక్ట్రానిక్ గాడ్జెట్స్, జిహాది మెటీరియల్ స్వాధీనము చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని జంపర్వా లోని సజాద్ హుస్సేన్ నివాసం ఉంటున్న ఇంటి నుండి ఒక సింగిల్ బారెల్ రైఫిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇది అతని బంధువుదని, ఆ ఆయుధాన్నిజిహాదీ కార్యా క్రమాలను ఉపయోగించేవారని తెలిసిందన్నారు. అదే విధంగా ఈనెల 13న పోలీసులు, మహారాష్ట్ర ఎటిఎస్ బృందాలు దాడులు నిర్వహించి తౌఫీక్ ఆలమ్ షేక్‌ను నాసిక్‌లోని మలేగావుల్లో అరెస్టు చేశారన్నారు. అరెస్టు సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు ,జిహాది మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఉన్న జైష్-ఎ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, చానల్స్‌లలో క్రియాశీలక సభ్యులుగా ఉన్నారన్నారు. వీరు జెఇఎం ఆపరేటర్లతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి పాకిస్తాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకొని భారతదేశం పై యుద్ధం చేయాలని యోచిస్తున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానాల్లో హాజరు పరచిన అనంతరము ట్రాన్సిట్ వారంట్లపై వారిని ధర్మవరానికి తీసుకువచ్చినట్లు ఎస్పీ వివరించారు. త్వరలో సంబంధిత న్యాయస్థానాల్లో జడీషియల్ రిమాండ్ కోసం పంపడం జరుగుతుందన్నారు. భారత దేశం లో నిషేదిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పిఎఫ్ఐ) వీటి యొక్క ప్రతినిధులు , ఇతర నిషేదిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, సామాజిక సేవ పేరుతో ఉగ్రవాద (జిహాది) కార్యాకలాపాలను సాగిస్తున్నారని, ముస్లిం యువతను ఉగ్రవాదులుగా తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎవరైనా ఈ రకమైన నిషేదిత సోషల్ మీడియా గ్రూప్‌లతో, పాకిస్తాన్ ఐఎస్ఐ, జిహాదీ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నట్లయితే వారిని దేశ వ్యతిరేక/ఉగ్రవాద కార్యకలాపంగా భావించి యుఎపి చట్టం, ఇతర సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో ఏమైనా సందేహాస్పద కార్యకలాపాలు లేదా ఆన్‌లైన్ కంటెంట్ భారత దేశ వ్యతిరేక లేదా రాడికలైజ్ భావాలను ప్రోత్సహిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారమివ్వాలని సూచించారు. ఈ కేసును చేధించిన ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలోని రెండు బృందాలను ఈసందర్భంగా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీ తో పాటు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, ముదిగుబ్బ సిఐ శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వండి..

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్ ఫరూక్

వార్డుల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం లేదు
కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి - పెనుకొండ

కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వండని సాధారణ కౌన్సిల్ సమావేశంలో అధికారులతో పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పెనుకొండ నగరపంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండా అంశాలను అధికారులు చదివారు. అజెండా అంశాలను ఏకగ్రీవంగా కౌన్సిలర్లు ఆమోదించారు. రూ.2.64 కోట్ల విలువైన 42 పనులకు ఆమోదం తెలిపారు. అనంతరం 16వ వార్డు కౌన్సిలర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ వార్డులలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. వార్డు పరిధిలో సోలార్ వీధిలైట్లను ఏర్పాటు చేశారని ఆ సమయంలో కౌన్సిలర్లను పరిగణలోకి తీసుకోకుండా ఏర్పాటు చేయడం బాధాకరమని అన్నారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న డ్రైనేజీను మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పూల మార్కెట్లో పూల వ్యాపారులను తరలించి కృష్ణదేవరాయ సర్కిల్ దుర్గా సర్కిల్లో ట్రాఫిక్ అంతరాయాన్ని పరిష్కరించాలని ఆయన కోరారు. 17వ వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు మాట్లాడుతూ కోనాపురం రహదారి, డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. డ్రైనేజీ నిర్మాణంపై స్లాబ్ నిర్మించడం లేదని డ్రైనేజీ ఓపెన్ గా వదిలిపెడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. డ్రైనేజీ పై స్లాబ్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కో ఆప్షన్ సభ్యులు న్యామత్ మాట్లాడుతూ.. ఈద్గా వద్ద డ్రైనేజీ మీరు రోడ్డుపై ప్రవహిస్తుందని కాలువ ఏర్పాటు చేసి మురికి నీరును తరలించేందుకు చర్యలు తీసుకోవాలనికోరారు. ఆదేవిధంగా ఈద్గా సమీపంలో హెచ్పి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పెద్ద కాలువను, ప్రభుత్వ చేతి పంపును ఓ కౌన్సిలర్ భర్త పూడ్చివేసి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కౌన్సిలర్లు ఆరోపించారు. తక్షణం చర్యలు తీసుకుని చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలని చైర్మన్ కమిషనర్‌ను కోరారు.

కోరం లేక ఆలస్యంగా ప్రారంభమైన సమావేశం

నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులున్నాయి. 18 వార్డులలో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు, రెండు వార్డుల్లో తెలుగుదేశం కౌన్సిలర్లు ఉన్నారు. వైసిపీ కౌన్సిలర్లలో మాజీ మంత్రులు శంకరనారాయణ, ఉషశ్రీ వర్గాలుగా ఏర్పడ్డారు. చైర్మన్ తోపాటు మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు శంకరనారాయణ వర్గంగాను మిగిలిన పదిమంది ఉషశ్రీ వర్గంగా ఉన్నారు. కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావద్దని పట్టణ పార్టీ కన్వీనర్ నరసింహులు కౌన్సిలర్లు తయ్యుబ్ సద్దాం మరో కౌన్సిలర్ భర్త సమావేశం పెట్టారు. కొందరు వీరి మాటలకు గౌరవం ఇచ్చి సమావేశానికి హాజరు కాలేదు. మరికొందరు తమ వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సమావేశానికి వెళ్లాలని ఆలోచన చేసినప్పటికీ వీరు అడ్డగించడంతో వారు కూడా సమావేశానికి హాజరు కాలేదు. దీంతో కోరం లేక 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12 గంటలకు ప్రారంభమైంది. ఏడుగురు కౌన్సిలర్లు ఒక కో ఆప్షన్ మెంబర్లు సమావేశానికి హాజరయ్యారు. దీంతో కౌన్సిల్ సమావేశం కొనసాగింది.

అభివృద్ధికి అడ్డుగా మారిన పలువురు వైసిపి కౌన్సిలర్లు

నగర పంచాయతీ పరిధిలో ప్రతి వార్డులలోను అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాటిని ఆమోదించేందుకు కౌన్సిల్ సభ్యులు హాజరు కావాల్సి ఉంటే చైర్మన్ లక్ష్యంగా చేసుకున్న ఉషశ్రీ వర్గం కౌన్సిలర్ అభివృద్ధి పనులకు అడ్డుగా మారిపోయారని విమర్శలు ఉన్నాయి. కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకూడదని సమావేశం పెట్టిన తయ్యుబ్, హరిత, రేవతి నాగలక్ష్మి తదితర కౌన్సిలర్లు వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలపై కమిషనర్ కు లేఖలు అందించారు. ఆ పనులకు అధికారులు అంశంగా పెట్టారు. నగర పంచాయతీలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో కౌన్సిలర్లు సమావేశాన్ని అడ్డగించి అభివృద్ధి నిరోధకులుగా మారిపోయారని పలువురు కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. చైర్మన్‌ను గద్దె దింపాలని ఇలాంటి చర్యలకు కౌన్సిలర్లు పాల్పడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే అభివృద్ధి పనులకు మేము అడ్డు కాదని పట్టణ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చైర్మన్ తో సహ పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. రాజకీయాలకు అభివృద్ధి పనులకు ముడి పెట్టడం నీచ రాజకీయాలకు నిదర్శనమని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామానికి చెందిన చింతకాయల బాబు (43) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల మేరకు బాబు కియా పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. ఆర్థిక సమస్యలతో పాటు, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన బంధువులు గ్రామంలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. మృతునిభార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని పులంపల్లి సమీపాన గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతిచెందారు. పిన్నదరి గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి పులంపల్లి గ్రామ శివారులో ముందుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని వెనక నుండి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన రామాంజనేయులును బత్తలపల్లికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. అయితే శుక్రవారం ఉదయం రామాంజనేయులు మృతిచెందారు.

కెనరా బ్యాంక్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మాగే చెరువు కెనరా బ్యాంకులో క్యాషియర్ గా పనిచేస్తున్న శివకుమార్ గురువారం వారపు సంతలో కాలుజారి పడటంతో అతడిని కుటుంబ సభ్యులు బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం శివకుమార్ మృతిచెందినట్లు ఆయన మిత్రులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కేకాతి గ్రామంలో మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు పాండు, చంద్రశేఖర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

క్రీడలు శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని ధర్మవరం మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ని నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన వారందరికీ కూడా డివిజన్ స్థాయికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రామకృష్ణ, సుమన, మండల కోఆర్డినేటర్లు స్వప్న, సరళ, ఫిజికల్ డైరెక్టర్లు నాగేంద్రప్రసాద్, రఘునాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి :స్థానిక ఓరియంటల్ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అండర్ - 14,అండర్ - 17 బాల బాలికల మండలస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. అందులో భాగంగా మండలం లోని అన్ని పాఠశాలలకు చెందిన బాల బాలికలకు వాలీబాల్, ఖోఖో, ఇతర క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని పిజికల్ డైరెక్టర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పీడీలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి.ఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 17 విభాగం నందు విద్యార్థులకు వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఆకార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రాజగోపాల్, లక్ష్మీనారాయణ, పిడి షఫీ,షబ్బీర్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని33/11 కే వి సబ్ స్టేషన్ సిరివరం ఫీడర్ లైన్ మరమ్మతుల కారణముగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఇ వెంకటేశలు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిరివరం ఫీడర్ పరిధిలోని సిరివరం, కొడిపల్లి, తిరుమలదేవరపల్లి, గోపిండేవరపల్లి, గౌరీగానిపల్లి, విభూదిపల్లి, మనేపల్లి, నాగేపల్లి, నాగనపల్లిలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - హిందూపురం

క్రీడల ద్వారా మానసిక ఆరోగ్యం కలుగుతుందని వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, మై భారత్ సభ్యులు పేర్కొన్నారు. గురువారం హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ (మై భారత్), ఆదర్శ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ రాజగోపాల్ నాయుడు, ఆదర్శ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం, మానసిక ఆరోగ్యం కలుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం పోటీలు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులకు మెమొంటో, సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కళాశాల ఏవో గంగిరెడ్డి, ఎంబిఏ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఉషారాణి, మైభారత్ సభ్యులు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

పాలిటెక్నిక్ మహిళా కళాశాల విద్యార్థినుల నిరసన

ప్రజాశక్తి -హిందూపురం

తమకు రక్షణ కల్పించాలని స్థానిక పాలిటెక్నిక్ మహిళా కళాశాల విద్యార్థినులు కోరారు. ఈ మేరకఉ వారు శుక్రవారం కళాశాల వద్ద బైటాయించి నిరసన చేపట్టారు. తమ పట్ల కళాశాల వార్డెన్, ఇన్చార్జి ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. తమకు రక్షణ కల్పించాలని, హాస్టల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, గోడలకు ఉన్న రంధ్రాలను పూడ్చి మరమ్మతులు చేయించాలని నినాదాలు చేశారు. దాదాపుగా 200 మంది వరకు విద్యార్థినులు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నామని కొన్ని రోజుల కిందట హాస్టల్లో దొంగతనం జరిగిందని చెప్పారు. అది జరిగినప్పటి నుంచి తాము తీవ్ర భయాందోళన చెందుతున్నామన్నారు. రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు హాస్టల్ బయట నుంచి లైట్లు వేస్తూ భయపెట్టిస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. కళాశాలలో ఉన్న హాస్టల్ స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ కావడంతో ప్రతి రూపాయి విద్యార్థులే ఇస్తున్నామని, అయినప్పటికీ తమకు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదని అన్నారు. పురుగుల అన్నాన్ని వడ్డిస్తున్నారని దీంతో ఆరోగ్య సమస్యలు వచ్చాయని, తాగునీరు లేకపోవడంతో చర్మ సమస్యలు వచ్చాయని విద్యార్థినులు వాపోయారు. రాత్రి సమయాల్లో సెక్యూరిటీ గార్డ్ లేకపోవడంతో కాంపౌండ్ వాల్ పడిపోయిన చోటు నుంచి దొంగలు హాస్టల్లోకి ప్రవేశించి విద్యార్థుల లాప్టాప్ సెల్ ఫోన్లు దొంగలించుకు వెళ్లారని అన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని విమర్శించారు. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇన్చార్జి ప్రిన్సిపల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థినులు

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మురుగుకాలువలో ఫినాయిల్ చల్లుతున్న వైద్యసిబ్బంది

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లి దళితవాడలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువల్లో మురుగు పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలకు ఆవాసాలుగా మారాయి. శుక్రవారం ఫ్రైడే డ్రై డే సందర్భంగా ఆశా వర్కర్లతో కలిసి ఒకరిద్దరు అధికారులు వచ్చి తూతూమంత్రంగా మురుగుకాలువలపై రసాయనాలు చల్లి ఫ్రైడే డ్రైడే విధానాలను తెలియజేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేసి వెళ్ళిపోయారు. అధికారులు నామమాత్రంగా ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడంతో మండలంలోని పలు గ్రామాలు, దళితవాడలు అపరిశుభ్రతతో ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పాపిరెడ్డి పల్లి దళితవాడలో సుమారు 70 కుటుంబాలు ఉన్నాయి. కాలనీలో ఉన్న నాలుగు కొళాయిలు విరిగిపోయి నీరు రోడ్ల వెంబడి ప్రవహిస్తున్న అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. చాలా రోజులుగా మురుగుకాలువలను శుభ్రం చేయడం లేదు. మేజర్ పంచాయతీ పరిధిలోని దళితవాడలోనే ఇలాంటి దుస్థితి ఉంటే మండలంలోని మారుమూల పంచాయతీల్లో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి యం, చౌడప్ప , ఎస్టీ సెల్ సహాయ కార్యదర్శి దేవరకొండ రమేష్, వైసిపి రూరల్ అధ్యక్షులుగా కునుతూరు గోపాల్‌ను ఎన్నుకున్న నేపథ్యంలో వారు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని శుక్రవారం గజ మాలతో సత్కరించారు. తమ ఎంపికకు సహకరించిన కేతిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గరుడంపల్లి నారాయణస్వామి , బడన్నపల్లి నరసింహులు, కేశగాళ్ల రంజిత్ కుమార్, గజ్జల శివ, గుజ్జల బొమ్మన్న, వెంకటరమణ స్వామి, దేవరకొండ చెంద్రాయుడు, విజయ్ కుమార్, సాకే వెంకటేష్, దేవరకొండ రాములు, గుజ్జల హనుమంతు, గుజ్జల నాగరాజు, కుళ్లాయప్ప, సుబ్రమణ్యం, పెద్దన్న, నాగార్జున , శ్రీనివాసులు , సాకే కిరణ్ పాల్గొన్నారు.

కేతిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం : వైసిపి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ప్రభుత్వ వైద్యకళాశాల ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం కొత్తచెరువు మండల పరిధిలోని నారేపల్లి, మైలసముద్రం, కేసాపురం, తిరుమల దేవరపల్లి కొడపగాని పల్లి గ్రామాల్లో వైసిపి నాయకులు పర్యటించారు. రచ్చబండ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల కోసం 17 వైద్య కళాశాలలు ప్రారంభించిందని, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ :కొత్తచెరువు మండల పరిధిలోని కేసాపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన సత్యనారాయణ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన శ్రీరాములు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి శ్రీరాములును పరామర్శించారు

సంతకాల సేకరణలో వైసిపి నాయకులు, ప్రజలు

ఆర్‌వి. జానకిరామయ్య సేవలు ఆదర్శం
మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి మేనేజింగ్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ తండ్రి ఆర్ వి జానకిరామయ్య ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ వి జానకి రామయ్య వర్ధంతి సందర్భంగా గణేష్ సర్కిల్ లో ఉన్న ఆయన సమాధి వద్ద పూలమాలను వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ జానకీరామయ్య సత్యసాయి ట్రస్టు మెంబర్‌గా పెనుకొండ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. బాబాకు ప్రజలకు మధ్య ఆయన వారధి లా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ కుటుంబ సభ్యులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తోట్ల గంగాధర్, బేకరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జానకిరామయ్య సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తదితరులు

మహిళా రైతులకు గుర్తింపు ఇవ్వాలి
రెడ్స్ అధ్యక్షురాలు భానూజ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కష్టపడి కూలి పనులు చేసుకుంటూ అరకొరగా ఉన్న భూములలో వ్యవసాయ సాగు చేసుకుంటూ పంటలు సాగిస్తున్న మహిళా రైతులను గుర్తించడం వారి కుటుంబం నుంచే ప్రారంభం కావాలని రెడ్స్ అధ్యక్షురాలు భానుజా పేర్కొన్నారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని గాండ్లపెంట మండలంలో కటారుపల్లి క్రాస్ నందు రెడ్స్ సంస్థ సే ట్రీ సంస్థ వారి సహకారంతో జాతీయ గ్రామీణ మహిళా రైతుల వారోసత్స్ వం(మహిళా దివాస్) నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా కరిది రెవిన్యూ డివిజన్ అధికారి వెంకట సన్యాసి శర్మ, రెడ్స్ డైరెక్టర్ భానుజా హాజరయ్యారు. రెడ్స్ డైరెక్టర్ భానుజా మాట్లాడుతూ మహిళా రైతులు ఆహార ఉత్పతులలో మగవారికి సమానంగా కష్ట పడుతున్నారన్నారు. అయినప్పటికీ వారికి గుర్తింపు లేదన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళల పాత్రకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. మహిళా రైతులకు రెడ్స్ సంస్థ సే ట్రీ సంస్థ వారి సహకారం తో ఉచితంగా ఇస్తున్న పళ్ళ మొక్కలను ఆర్డీవో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సేవ్ ట్రీ అరుణ్ కుమార్, రెడ్స్ సిబ్బంది రాజశేకర్, శ్రీనివాసులు, ఎల్లప్ప.మహిళా రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'హరీష్' విద్యార్థులు

ప్రతిభా విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మండల పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.ఎస్. కిరణ్, గోల్ షూట్ బాల్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న శైలజ, హిమబిందు ఈనెల 29 నుండి నవంబర్ 1వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని బిగుసరాయ్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసన్న కుమార్‌ను కరస్పాండెంట్ కిరణ్ కుమార్ అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని నారనాగేపల్లికి చెందిన వెంకటేష్ (30)గురువారం తిరుపతిలో చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందారు. దీంతో మృతదేహాన్ని శుక్రవారం నారనాగేపల్లికి తీసుకుని వచ్చారు.విషయం తెలుసుకొన్న ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ.7వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణ, మనోహర్, లింగప్ప, నాగిరెడ్డి, గోవిందు, ధనుంజయ్ గౌడ్, చిన్నప్పయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణములోని రాజేంద్రనగర్‌లో ఐదవ తరగతి చదువుతున్న ఇర్షాద్ గురువారం కుటుంబంతో కలిసి పెనుగొండకు వెళ్లి వచ్చే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో స్థానిక ఎంఇఒలు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవి మృతుని కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. విద్యార్థి మృతికి సంతాపం తెలిపారు. విద్యార్థికి ప్రభుత్వం తరపున రావలసిన సౌకర్యాలను అందజేస్తామని చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి- పరిగి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు టెక్నాలజీ తో పాటు నైపుణ్యభివృద్ధి సాధించాలని లైఫ్ టీచర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య అజిత్ పేర్కొన్నారు. పరిగి మండలంలోని కోడిగిన హళ్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన వికసిద్భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూపురం బిట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ తో పాటు హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంటలెక్చువల్ టెక్నాలజీ కన్నా అడ్వాన్స్ క్వాంటం రాబోతుందన్నారు. విద్యార్థులు మరింత అడ్వాన్స్ టెక్నాలజీని అందిపుచ్చుకునే విధంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

'పల్లవి' వార్షిక మహాసభ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో డిఆర్‌డిఎ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 23వ వార్షిక మహాసభను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్థిక సంవత్సరం కార్యచరణ ప్రణాళికను నిర్వహించారు. మండల సమాఖ్య వార్షిక నివేదిక,కార్య వర్గ సమావేశాలు,ఆదాయ వ్యయాలు ఎంఎస్ నుండి అమలు జరుగుతున్న సేవలు,సమాఖ్య చేపట్టిన శిక్షణ తదితర వాటిపై చర్చించారు. 2025-26 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పాలక వర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మీ, కార్యదర్శిగా శారదమ్మ, ఉపకార్యదర్శిగా రత్నమ్మ, కోశాధికారిగా గంగరత్నమ్మ, భాగ్య మ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వేణుగోపాల్, చెన్నకేశవులు, శ్రీనివాసులు రెడ్డి, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి

ప్రజాశక్తి గోరంట్ల

పట్టణంలోని విజయనగర్‌లో రాయల యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో చరిత్రకారుడు మైనా స్వామి మాట్లాడుతూ. రాజ్యంలో వివాహ పన్ను అమలులో ఉన్న సంగతిని వేగుల ద్వారా తెలుసుకున్న శ్రీకష్ణదేవరాయలు తక్షణం వివాహ పన్నును రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ మడకశిర దగ్గర గల ఆగళి లోని శంకరేశ్వర ఆలయంలో, మదనపల్లి వద్ద ఉన్న రంగసముద్రం పొలాల్లో, ప్రొద్దుటూరు రామేశ్వరాలయం తదితరచోట్ల శాసనాలను 1510లో రాయించినట్టు తెలిపారు. రాజ్యంలోని వేలాది దేవాలయాలకు లక్షలాది ఎకరాల భూములను ఎటువంటి పన్నులను చెల్లించనవసరం లేకుండా శ్రీకృష్ణదేవరాయలు దానం చేశారన్నారు. ఫిబ్రవరి 16న రాయలవారి జయంతి, ఆగస్టు 7న పట్టాభిషేకోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, సర్పంచి నరసింహమూర్తి, బాలాజీ, నరేంద్ర, కమలాకర్, వేణు రాయల్ శ్రావణ్, హరి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళి

కదిరి టౌన్: శ్రీ కృష్ణ దేవరాయలు వర్ధంతిని పురస్కరించుకొని కదిరి పట్టణంలోనీ హిందూపూర్ రోడ్ కోనేరు వద్ద గల శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహానికి బలిజ కులస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రంలో బలిజ సంఘం అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు

బుక్కపట్నం : శ్రీకృష్ణదేవరాయల పాలన స్వర్ణయుగమని మండల బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల 496 వర్ధంతిని మండల కేంద్రంలో వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, రాయల్ యూత్, ప్రజలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి సాయి ఆరామం లో పుట్టపర్తి బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు చింతాదామోదర్, తొట్ల గంగాధర్ సుబ్బు ,రాము బొగ్గరం శ్రీనివాసులు, ఆంజనేయులు ,బాలగంగాధర్, మారుతి, అల్లాడి జయరాం, పూల శివ, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బలిజ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతి సందర్భంగా స్థానిక గుర్నాథ్ సర్కిల్ లో ఉన్న విగ్రహానికి బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.